తీరం .. ఎంత భద్రం?

దేశ సరిహద్దులో సైనికులు ఎంత కీలకమో తీర ప్రాంతాల్లో మెరైన్ పోలీసులూ అంతే ముఖ్యం. తీరంలో నిఘా ఉంచడం, గూఢచారుల జాడ కనిపెట్టడం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడటంతో పాటు భద్రతకు పటిష్ట మైన చర్యలు తీసుకునే ముఖ్యమైన వ్యవస్థ మెరైన్. అయితే రుషికొండలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో పూర్తిస్థాయి సిబ్బంది కానీ, పరికరాలు గానీ లేవు. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయి భద్రత ఎంతవరకు సాధ్యం?



భీమిలి సముద్ర తీరం

రుషి కొండ మెరైన్ పోలీస్టేషన్‌లో సిబ్బంది కొరత

60 మందికి 27 మంది మాత్రమే..

పర్య వేక్షించాల్సిన బోట్లు మూలకు..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌పై అధికారులు సీతకన్ను వేశారు. ఇక్కడి స్టేషన్‌లో కనీసం సగం మంది కూడా సిబ్బంది లేరు. పర్యవేక్షణకు బోట్లు కూడా పూర్తిస్థాయిలో లేవు. మరోవైపు వసతుల లేమితో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

తొమ్మిది తీర ప్రాంతాలు..

రుషికొండ బీచ్ మెరైన్ పోలీస్టేషన్ పరిధిలో ముఖ్యమైన తొమ్మిది తీరప్రాంతాలు ఉన్నాయి. జోడుగుళ్లపాలెం బీచ్, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, రుషికొండ, ఐటీ జంక్షన్ బీచ్, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి, పెదనాగమయ్యపాలెం బీచ్ వంటి ముఖ్యమైన తీర ప్రాంతాలన్నీ ఈ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. వాస్తవానికి ఈ అన్ని తీరప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలంటే 60 మంది సిబ్బంది తప్పకుండా ఉండాల్సిందే. కానీ ప్రస్తుతం 27 మంది మాత్రమే ఉండటంతో చాలీచాలని సిబ్బందితో ఏదో విధంగా నెట్టుకొస్తున్నారు.

ఇవీ విధులు..

ఈ తీర ప్రాంతాల్లో నిత్యం భద్రతను పర్యవేక్షించడం, గూఢచారుల జాడ తెలుసుకోవడం, తీర పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులను అప్రమత్తం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు ప్రత్యేకంగా నమోదు చేసి, దర్యాప్తు చేయగల 16 ప్రత్యేక చట్టాలు ఇక్కడ ఉన్నాయి. వాటిలో భారతదేశ సముద్ర మండలాల (విదేశీ నౌకల ద్వారా చేపలు పట్టడం నియంత్రణ) చట్టం 1981, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ చట్టం 2005, తీర ప్రాంత ఆక్వాకల్చర్ నియంత్రణ వంటివి ఉన్నాయి. అయితే ఇవన్నీ పూర్తి స్థాయిలో ఏ అవరోధం లేకుండా నిర్వర్తించాలంటే తప్పనిసరిగా 60 మంది సిబ్బంది ఉండాల్సిందే. వాస్తవానికి ఈ మెరైన్ వ్యవస్థ 12 నాటికల్ మైళ్ల దూరం వరకు నిఘా పెడుతుంది. అయితే పూర్తి స్థాయిలో సిబ్బంది ఉంటే తీర ప్రాంత భద్రత పూర్తిగా పటిష్టంగా ఉంటుందని అధికారుల అభిప్రాయం. 60 మంది పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

సమస్యలు అనేకం..

ఇక్కడున్న మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరతతో పాటు తాగునీటి సమస్య కూడా వేధిస్తుంది. అదే విధంగా చుట్టూ ఉన్న మూడు ఎకరాల స్థలంలో మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో వచ్చే వారికి కాస్త ఇబ్బందిగా ఉంటోంది. స్థలం సంరక్షణలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఇక్కడి పోలీసులు తెలిపారు.



రుషికొండ బీచ్ వద్ద శిథిలావస్థకు చేరుకున్న మెరైన్ పోలీస్ టవర్



రుషికొండలో మెరైన్ పోలీస్‌స్టేషన్

మూలకు చేరిన బోట్లు

తీర ప్రాంత భద్రతకు మెరైన్ పోలీసులు ఎప్పటికప్పుడు 12 నాటికల్ మైళ్ల దూరం వరకు బోట్లల్లో ప్రయాణించి, పర్యవేక్షించాలి. కానీ ప్రస్తుతం ఉన్న మూడు బోట్లు కూడా మూలకు చేరుకోవడంతో నిఘాకు ఇబ్బంది ఏర్పడుతుందని ఇక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఒక్క బోటునైనా అందుబాటులోకి తీసుకుని వస్తే నిఘా పటిష్టం చేయవచ్చని ఇక్కడి వారు అభిప్రాయపడుతున్నారు.



కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాం



రుషికొండ మెరైన్ పోలీస్టేషన్‌లో సిబ్బంది కొరత, తాగునీరు, ఖాళీ స్థలం చుట్టూ ఫెన్సింగ్ తదితర సమస్యలను ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బోట్లు కూడా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– వి. శ్రీనివాసరావు, సీఐ, మెరైన్ పోలీస్‌స్టేషన్, రుషికొండ

క్లుప్తంగా


వేడుకగా సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట



హోమంలో పాల్గొన్న భక్తులు

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయం వెనుకగల వేపచెట్టుకు చేరువలో నిర్మించిన పీఠంపై సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిరణ్ కుమార్ బృందం ప్రతిష్టా పూజలు నిర్వహించింది. స్థానిక నాయకుడు పోతిన శ్రీనివాసరావు, లక్ష్మీపరమేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోతిన నాయుడు బాలాజీ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



చిల్లపేటలో ప్రతిష్ఠించిన ఎల్లమ్మతల్లి విగ్రహం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిల్లపేటలో ఆదివారం ఉదయం ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. అర్చకుల పూజా కార్యక్రమాల అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేషంగా భక్తులు పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం సిగడాం మహలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి ఎల్లమ్మతల్లి ఆలయ ఆవరణలో చిల్లపేట, జీరుపేట, సంతపేటకు చెందిన కళాకారులచే బైఠో భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలకు చిల్లపేట, జీరుపేట గ్రామాల ప్రజలు సహాయ సహకారాలు అందించారు.

శివశక్తినగర్‌లో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయశ్రీ ఆస్పత్రి ఎండీ బగాది సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఎండోక్రైనాలజీ వైద్య నిపుణుడు పైడి వేణు, ఇతర వైద్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో కళింగ సంక్షేమ సంఘం మధురవాడ జోన్ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, ఆర్. వెంకటరమణ, జగదీశ్వరరావు, శేఖర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం మీదే..



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

పద్మనాభం: ఏకాగ్రతతో చదివితే విజయం సొంతమవుతుందని సీఐ సి.హెచ్.శ్రీధర్ అన్నారు. పరీక్షలకు సమయం తక్కువ ఉన్నందున పదో తరగతి విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. పద్మనాభంలోని గోస్తని విద్యాపీఠ్‌లో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు టీవీలకు దూరంగా ఉండి దృష్టంతా చదువుపై పెట్టాలన్నారు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గోస్తని విద్యాపీఠ్ వ్యవస్థాపకుడు కె.సూరిబాబు, హెచ్ఎం ఎం.పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజానికి మంచి రచనలు అవసరం

భీమునిపట్నం: ప్రస్తుత సమాజానికి మంచి కథా రచనలు అవసరమని కళాసాహితి అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ అన్నారు. అటువంటి రచనలను చేసేవారిని ప్రోత్సహించాలని సూచించారు. భీమిలిలో వెల్చేరు కళావేదిక, కళాసాహితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రచయితల ప్రోత్సాహ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ప్రాంతాల్లో ఎందరో మంచి రచయితలున్నారని, వారి రచనలు చదవడంతో పాటు ఎక్కువమంది చదివేలా చూడాలన్నారు.

నగదు బహుమతుల ప్రదానం

వెల్చేరు కళావేదిక వ్యవస్థాపకుడు వెల్చేరు చంద్రశేఖర్ మాట్లాడుతూ మంచి రచనలను ప్రోత్సహించేందుకు ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా 120 కథలు వచ్చాయని తెలిపారు. వాటిలో కొన్నింటిని ఎంపిక చేసి, రచయితలకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నామన్నారు. ఈ కథల్లో నవ్వులూరి వెంకటేశ్వరరావు రచించిన దామోదరుడి నోస్టాల్జియా అనే కథ, నందిరాజు పద్మలత జయరాం రచించిన జీవోన్నాస్తి మృత్యువు గోచరహా అనే కథలు ప్రథమ బహుమతికి ఎంపికవగా రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందించారు. నాలుగు కథలకు రూ.5వేలు, నాలుగు కథలకు రూ.4 వేలు, ఐదు కథలకు రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వెల్చేరు కళావేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య సభ్యులు మునుకుట్ల కోటయ్య, కాళ్ల సన్నీ, మునునూరి సూర్యశ్రీనివాస్, పోతిన అరవింద్, కంటుభుక్త రామానాయుడు పాల్గొన్నారు.



వెల్చేరు కళావేదిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

శబరిమలలో వసతికల్పనకు కృషి

భీమునిపట్నం: భీమిలి నుంచి శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు వసతి కల్పించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని భీమిలిలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు అన్నారు. అయ్యప్ప ధ్యాన మందిరం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఇక్కడి నుంచి వెళ్లే భక్తులకు సరైన వసతి సదుపాయం లేకపోవడంతో అక్కడ బస చేయడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ సంఘం సభ్యులు కేరళలోని ట్రావెన్‌కోర్ కమిటీని కలిసి వసతి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం, గుగ్గిళ్ల సాయి, కోశాధికారి పిల్లి శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేవాసంఘం అధ్యక్షుడు ఎర్రునాయుడు

నూతన కార్యనిర్వాహక సంఘం ఏర్పాటు

భీమునిపట్నం: భీమిలిలోని పురాతన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి నూతన కార్య నిర్వాహక సంఘం ఏర్పాటు ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కె.ఎస్.ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులుగా విజయమ్మ రోనాల్డ్, హెచ్.జాన్సన్‌రాజు, కార్యదర్శిగా ఎన్.రవికుమార్ సహాయ కార్యదర్శిగా కె.స్టీఫెన్, కోశాధికారిగా పి.ఎస్.చంద్, సహాయ కోశాధికారులుగా ఎస్.విలియం కేరీ, జె.ఆర్బర్ట్ సుదర్శన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చర్చికి సంబంధించిన డెకన్‌బోర్డు చైర్మన్‌గా ఎస్.మోహన్‌కుమార్ ఎంపికయ్యారు. అనంతరం చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ గిడియన్ విజయకుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి నూతన కార్యనిర్వాహక సంఘ సభ్యులు

ఆనంద‘సాగరం’





సముద్రాన్ని చూస్తే ఆనందానికి అవధులే ఉండవు. కడలి ఒడిలో చిన్న,పెద్ద భేదమే ఉండదు. కెరటాలతో పోటీగా యువత కేరింతలు కొడితే.. చిన్నారులు నీటిలో ఆటలాడుతూ స్నానాలు చేశారు. అలల చెంత మధుర క్షణాలను కెమెరాలో బంధించి ఆనందించాయి అందాల జంటలు.. ఇలా రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం ఆనంద సాగరమే అయింది.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.20వేలు వితరణ

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బీజాగ్ బీచ్ రెస్టారెంట్ యజమాని అమటాపు శ్రీకాంత్ రూ.20వేల సాయం అందించారు. వీటిని ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాటు చేశారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి ప్రతి సోమవారం మాధవరపు మాల్యాద్రి అనే భక్తుడు ఆలయం, విగ్రహాల అలంకరణకు పూల దండలు అందిస్తున్నారని ఆలయ కమిటీ ప్రతినిధి కోరాడ సూరిబాబు తెలిపారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు



వీడ్కోలు వేడుకలలో పాల్గొన్న లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 9వ తరగతి విద్యార్థులు నిర్వహించిన ఈ వేడుకలలో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నత చదువులకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పైపు లైన్ లీకుతో తాగునీరు వృథా



వృథాగా పోతున్న నీరు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు చిట్టివలస శివాలయం ముందు పైప్‌లైన్ నుంచి కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. ఇక్కడ ఏర్పడిన గోతిలో నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో తాగునీరు బయటకు వచ్చి డ్రైనేజీలో కలిసిపోతుంది. వేసవి మొదలై, గోస్తని నదిలో నీరు అడుగంటుతున్న వేళ తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్వర్ణభారతి నగర్‌లో గెడ్డ ఆక్రమణ



మట్టితో కప్పివేస్తున్న గెడ్డ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో రోజురోజుకూ ఆక్రమణలు ఎక్కువైపోతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్కడితో ఆగకుండా గెడ్డలను సైతం ఆక్రమించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న గెడ్డ వద్ద రాత్రి సమయాల్లో లారీల్లో మట్టిని డంప్ చేస్తున్నారు. ఇక్కడున్న ఓ స్థానిక నాయకుడి సహకారంతో ఈ ఆక్రమణలు జరుగుతున్నాయని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డ పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో స్వర్ణభారతినగర్‌కు వరద ముంపు తప్ప దని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించకుంటే, కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని స్థానికులు తెలిపారు.

50 వసంతాల అ‘పూర్వ’ కలయిక



భీమిలిలో కలుసుకున్న డైట్ పూర్వ విద్యార్థులు

‘డైట్’లో పరిమళించిన స్నేహసుగంధం

భీమిలిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఆదివారం స్నేహ సుగంధం పరిమళించింది. 50 సంవత్సరాల అనంతరం కలుసుకున్న మిత్రబృందం ఆనందోత్సాహాలకు వేదికైంది. 1975లో చదువుకున్న నాటి విద్యార్థులంతా ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. ఆ రోజులను, అలనాటి జ్ఞాపకాలను తలచుకుని, మళ్లీ కాలేజీ పిల్లలే అయ్యారు. కార్యక్రమాన్ని నిర్వహించిన పూర్వ విద్యార్థి, విశ్రాంత ఉపాధ్యాయుడు టి.భీమారావు మాట్లాడుతూ ఇన్నేళ్ల తర్వాత తామందరం ఇలా కలుసుకోవడం మధురానుభూతిగా మిగిలిపోతుందన్నారు. సాయంత్రం వరకు సరదాగా గడిపిన సుమారు 45 మంది పూర్వ విద్యార్థులు మళ్లీ కలుసుకుందామంటూ భారమైన మనసుతో వీడ్కోలు పలికారు.

– భీమునిపట్నం

గీతా జ్ఞానం ఉత్కృష్టం

తగరపువలస: భగవద్గీత ఉత్కృష్ట జ్ఞాన సంపద అని ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాధరావు అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం దాకమర్రిలో ఫాల్గుణ మాసం విశిష్టత, హోలీ పౌర్ణమి గురించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ అంటే పండులా మారడం అని తెలిపారు. జ్ఞానంతో పండించుకుని పండితునిగా, జ్ఞానిగా మారాలన్నారు. ప్రతి పండగ రోజూ ప్రపంచ పనులు వదిలి, జ్ఞానం తెలుసుకుని సర్వ మానవాళికి సమన్వయ జ్ఞానాన్ని అందించిన త్రైతసిద్ధాంత భగవద్గీత గురించి తెలుసుకోవాలన్నారు. భగవానుని గీతోపదేశం పొంది సంపూర్ణ గుణహరుడైన భక్తుడే ఫల్గుణుడని, అందుకే అర్జునుడిని ఫల్గుణుడు అంటారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, ఎస్.శ్రీనివాస్, సూర్యనారాయణ, అప్పలనాయుడు, భవాని తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు సాయిరవీంద్ర పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు, ఇన్‌క్రెడిబుల్ ప్లే స్కూల్ చిన్నారుల పట్టభద్రుల వేడుకలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. బైపాస్ రోడ్డులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా గురజాడ సకూల్ డైరెక్టర్ జి.కృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త రంగూరి సీతారామదొర హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తాళ్లవలస లిటిల్ హగ్స్ భరోసా అనాథాశ్రమంలోని 20 మంది అనాథలకు ఉచితంగా విద్య అందిస్తున్న కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్‌లను అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా బోల్ బేబీ బోల్ ఫేం శ్రావ్య గీతాలాపన, లిమ్కా బుక్స్ ఆఫ్ రికార్డ్ స్వాతి నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నాయి. చిన్నారి పట్టభద్రులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అతిథులు కృష్ణ, సీతారామదొర